# కొత్త రచయితలు

## లవ్ స్టోరీ

## రోమియోల ఆటకట్టు

"జరగండి వెనక్కి జరగండి..." అరుస్తున్నాడు కండక్టరు. బస్సులో తొక్కిసలాట ప్రారంభమయింది. ఎంత జరగాలని ప్రయత్నించినా శరీరానికి శరీరానికి మధ్య రాపిడి తప్ప నిల్చున్న చోటునుండి అరంగుళం కూడా కదల్లేక పోతున్నారు.

పూల వాసన, చెమట కంపు, చుట్ట వాసన-అన్ని వాసనలూ ఏకమై భరించలేని దుర్గంధం కొడుతోంది బస్సులో.

"అంటే రూపాగంగూలీలా వుంది గురూ!"

"ఏ! రూపాగంగూలీకి ఇంత అందమైన పెర్సనాలిటీ ఏడ్చిందేమిటీ."

"అంతేనంటావా?"

"ఖచ్చితంగా!"

అతి కష్టం మీద తల వెనక్కు తిప్పి చూసింది తులసి. ఆమె వెనుక నలుగురు యువకులు నిల్చుని తులసివైపే కొంటెగా చూస్తూ కామెంట్స్ చేస్తున్నారు. వారిలో ఓ యువకుడు దాదాపు ఆమె వీపుకి ఆనుకుని నిల్చున్నాడు. ఒక్కసారిగా శరీరం జలదరించింది. ముందుకు జరగాలని ప్రయత్నించింది కానీ ఫలించలేదు. చేసేదిలేక తన ముందే నిల్చున్న భర్త శరీరానికి అంటుకుపోయింది.

- ఆ యువకుడు మెడను కాస్త ముందుకు వొంచి ఆమె తలలోని మల్లెపూలను వాసన చూస్తూ మత్తుగా కళ్ళు మూసుకున్నాడు.

"రాస్కెల్" తనలో తానే గొణుక్కుంది.

"మన సత్యం చాలా అదృష్టవంతుడు. నిల్చుని ప్రయాణం చేస్తున్నా స్వర్గలోకం అంచుల దాకా వెళ్ళిపోతున్నాడు" నలుగుర్లో ఒకడు కామెంట్ చేశాడు. ఆ డోకు జోకుకి ఘొల్లున నవ్వేరు అతని స్నేహితులు.

సత్యం కుడికాలు చెప్పును విడిచి పాదాన్ని కొంచెం ముందుకు జరిపి మృదువుగా తులసి పాదాన్ని తాకాడు.

పాము కాళ్ళమీదనుండి సర్రున దూసుకు పోయినట్లుగా ఉలిక్కిపడిందామె. పాదాన్ని ముందుకు కదల్చాలని ప్రయత్నించింది. కానీ ఉన్నచోటు నుండి రవ్వంత కూడా కదలలేదు. నిస్సహాయంగా మిన్నకుండి పోయింది.

ఆమెలో ఏవిధమైన తిరుగుబాటూ లేకపోవడంతో అతని నీచ ప్రవృత్తి పేట్రేగిపోయింది. తెలియని ఉద్వేగంతో రోమాలు నిక్కబొడుచుకున్నాయి. చూపుడు వేలితో ఆమె నడుంపై ఒంపు తిరిగిన మడతలో చిన్నగా పొడిచేడు. కెవ్వున అరవబోయిందామె. కానీ సిగ్గుతో గొంతు దాటి రాలేదు. చేత్తో భర్తను తట్టి పిలిచి చెవిలో సన్నగా చెప్పింది తులసి-

"ఏమండీ! నా వెనకున్న కోతిమూక భరించరాని వెధవ్వేషాలు వేస్తున్నారు."

"తులసీ! సినిమా థియేటర్ల వద్ద, బస్సుల్లోను ఇలాంటివి తప్పవు. ఒక్క గంట ఓర్పు వహించు. మన ఊరు వచ్చేస్తుంది."

ఆశ్చర్యపోయిందామె. సహజంగా అంతగా

రచయిత చిరునామా
అనపర్తి రాంబాబు,
ఇంటి నెం. 3-24-13, మార్కండరాజుపేట,
తుని - 533 401.

ఆశ్చర్యపోయింది ఆమె జీవితంలో అది తొలిసారేమో!

"సరే మీరన్నట్టుగా గంట సేపు ఓపిక పడతాను. అసలు నేను గర్భవతినైతే తండ్రి మీరు కానంత మాత్రాన ఆశ్చర్యపోనవసరమేమీ లేదు" అందామె కోపంగా.

ఆ మాటతో వేరే మగాడయితే ఛెళ్ళున చెంప మీద చరిచినట్టయి గుండె నిండా పౌరుషం పొంగుకొచ్చేది. తులసి ఆశించినట్టుగా భర్తలో ధైర్యం, తెగింపు ముచ్చటైనా కనిపించ లేదు.

ఒకవేళ ధైర్యముచ్చి వారికి ఎదురు తిరిగినా 'అందరూ తన భార్యని పరీక్షగా చూస్తారు. దాంతో తనకు తీరని పరువునష్టం. ఈ విధంగా అందరి దృష్టిలో పడేకంటే ఓ గంట నోరు మూసుకొని ఊరుకుంటే ఏ గొడవా వుండదు' ఇదీ అతడి ఆలోచన.

అతను పరువునష్టం గూర్చి ఆలోచించాడే కానీ తన భార్య ఆ కోతిమూక చూపులకు, చేష్టలకు ఏవిధంగా రేప్ చేయబడుతుందో ఆలోచించలేకపోయాడు.

తను అంత బలమైన మాటన్నాక కూడా భర్తలో ఏవిధమైన ప్రతిస్పందనా లేకపోవడంతో కాస్త సిగ్గు పడిందామె. తర్వాత అతని ముఖం లోకి చూసింది.

ఆ చూపులో అతనికి దొరికిన భావం- "అసమర్థుడా" అని.

బస్సు ఆగింది!

ఎంత మంది దిగారో అంతకు రెట్టింపు జనం బస్సులోకి చొరబడ్డారు. లేని ఉత్సాహాన్ని నింపుకొని నేటి తెలుగు సినిమా సంగీతంలా రొద చేసుకొంటూ మళ్ళీ బయలు దేరింది బస్సు.

కండక్టర్ "జరగండి-వెనక్కి జరగండి..." అని అరుచుకుంటూ టిక్కెట్లు కట్ చేయటానికి వస్తుండటంతో ప్రయాణీకులలో తొక్కిసలాట, తిట్లాట ప్రారంభమయింది.

జనంలో ఎవరో తన కాలును తొక్కయటంతో తిట్ల యుద్ధానికి దిగిందో ముసలమ్మ. అంతలోనే ఎవరో ఆమెకు సర్ది చెప్పసాగారు.

నలుగురు యువకులలో ఒకడన్నాడు-

"ఒరేయ్! ఒక మంచి జోక్ చెప్పనా!"

"చెప్పస్వామీ" ఏక కంఠంతో అన్నారు మిగతా వారు.

అతడు ఉత్సాహంగా చెప్పసాగేడు-



"ఒక యువకుడికి 'ఎదురింటావిడ ఏవిధంగా గర్భవతి అయిందో?' అనే సందేహం కలిగింది. తన సందేహ నివృత్తి కోసం ఆమె ఇంటికి వెళ్ళాడు. ఆ సమయంలో ఆమె భర్త ఇంటివద్ద వున్నాడు. ముందు గదిలో పేపరు చదువుకుంటున్న ఆమె భర్తను నిలదీసి అడిగేడు-'మీ భార్యకు గర్భం ఏవిధంగా వచ్చిందో తెలియటం లేదు నాకు. మీకేమైనా తెలుసా? తెలిస్తే నాక్కాస్త చెప్పండి' అన్నాడు. అది విన్న ఆమె భర్త అతని వంక కోపంగా చూడసాగేడు. ఆ యువకుడు కంగారు పడుతూ 'అహ్, అలా కోప్పడకండి. కేవలం ఒక్క ముద్దుకే గర్భం వస్తుందన్న విషయం నేనెక్కడా వినలేదు' అన్నాడు. 'ఒక ముద్దేమిటి?' అన్నాడామె భర్త. 'మరి మీ భార్య నాకిచ్చింది ఒక్క ముద్దేగా...!' అంటూ అసలు విషయం చెప్పేశాడు ఆ యువకుడు."

అది విని అతని ఫ్రెండ్స్‌తోపాటు ప్రయాణీకులలో కూడా కొంత మంది నవ్వేరు.

తను చెప్పిన జోక్‌కి తానాశించిన రెస్పాన్స్ రావడంతో చెప్పరాని ఉత్సాహమొచ్చి ఏవేవో కబుర్లు చెప్పసాగేడు ఆ యువకుడు.

తన వెనుక నిల్చున్న కుర్రవాడి పేరు సత్యం. జీవమున్న అజంతా శిల్పంలాంటి ఆమె శరీరంపై అతడి చేతి వేళ్ళు ఎక్కడెక్కడో సర్పిస్తుంటే ఆమె దివ్య స్వరూపం మనసును పూర్తిగా ఆక్రమించుకుంది. ఆమె నున్నటి నడుం మడతలోనుండి కాస్త కిందకు జారింది అతని దృష్టి. దాంతోపాటే చెయ్యి కూడా...

తులసి మనసులో తీవ్రమైన సంచలనం. పరాయి మగాడి స్పర్శ ఆమెకదే తొలిసారి. ఆ స్పర్శను భరించలేక పోతోంది. "వాడు ఏం చేసినా పర్వాలేదు. ఆఖరకు గర్భం వచ్చినా నేను నీతో కాపురం చేయగలను" అని భర్త తనను గాలికి వదిలేసాడు. వాడు తనేం చేసినా భర్త కనవసరం. అలాగని తను భరించకూడదు. ఇలాంటి వాడికి ఒకసారి గట్టిగా బుద్ధి చెప్తే మరో ఆడదాని జోలికి వెళ్ళటానికి జంకుతాడు.

ఏం చేయాలి?

తనేం చేసినా తన భర్తలో మార్పు రావాలి. తన జీవిత రక్షణ కవచం తన భర్త. తన భర్త ద్వారానే ఈ కోతి మూకకు బుద్ధి చెప్పాలి.

ఎంత ధైర్యం వీడికి! ఒకరి ముక్కూ ముఖం ఒకరికి తెలియదు. అందరితో పాటు ప్రయాణం చేస్తూ తను సొంత పెళ్ళాం అన్నట్టు ప్రవర్తిస్తాడా!

కేవలం తననే కాదు, అందంగా కనిపించిన ప్రతి స్త్రీనీ ఇలాగే అవమానిస్తాడు. ఇదో వ్యాధి. అందంగా వున్న స్త్రీ వద్ద ఈ వ్యాధి మేల్కొంటుంది.

వీడికి సరైన బుద్ధి చెప్పాలి.

కాదు! చెప్పించాలి.

చక చకా ఆలోచించింది.

వెంటనే తట్టిందో ఆలోచన. దాని ఎలా అమలు పరచాలో ఒక్క క్షణం ఆలోచించి భుజాల మీదుగా తలను తిప్పి ఓరగా చూసింది తనను ఆనుకొని నిల్చున్న సత్యం వంక. తర్వాత భర్త వంక చూసింది. అతను గమనించలేదు, ఎటో చూస్తూ నిల్చున్నాడు.

మరోసారి ఆమె వెనక్కి చూసి ఆ యువకుడ్ని చూస్తూ చిన్నగా నవ్వింది.

చప్పున తలతిప్పి అప్పుడు చూసాడామె భర్త-తన భార్య ఆ యువకుడి వంక చూసి కవ్వింపుగా నవ్వటం.

తాచుపాములా బుస్సుమంది కోపం. కళ్ళల్లో ఎర్రజీర, కసిగా పళ్ళు కొరుక్కున్నాడు.

'ఆ పోకిరీవాడికేదో బుద్ధి లేదనుకుంటే దీనిక్కూడా బుద్ధి లేకుండా పోయింది. ఇప్పుడే వాడికి సరైన బుద్ధి చెప్పాలని తనతో కంప్లైయింట్ చేసింది. అలాంటిది ఇంతలోనే వాడిలో ఏం చూసి లొంగి పోయింది? మొగుడ్ని

పక్కన పెట్టుకొని భయం భక్తి లేకుండా బరి తెగించిన దానిలా ఎవడో ముక్కూ ముఖం తెలియని వాడికి శరీరాన్ని అప్పగించి కులుకుతుందా! అసలు తప్పంతా తనదే. వెనుక నిల్చుని తన భార్య అందర్నీ కొరుక్కుతింటుంటే తను ధైర్యంగా నాలుగు వడ్డించేయవలసిందిపోయి పరువు గురించి ఆలోచించాడు....

ఇంత జరిగినా కూడా తను చూస్తూ ఊరుకుంటే ఇక ఎప్పటికీ తన భార్య దృష్టిలో అసమర్థుడుగానే మిగిలిపోతాడు తను.

ఏం చేయాలి వీడిని?' తీవ్రంగా ఆలోచించ సాగేడు ఆమె భర్త.

ఆమె నవ్వేక విజయగర్వంతో మరింత పేట్రేగిపోసాగేడు సత్యం.

అది చూసి అతని మిత్రులు సన్నగా మాట్లాడుకోసాగేరు.

కుడి చేతిని ధైర్యంగా ముందుకు చాపి ఆమె భుజాన్ని కసుక్కున నొక్కాడు. కెవ్వున అరవ బోయింది తులసి. కానీ అంతలోనే తమా యించుకుని భర్త ముఖంలోకి చూసింది. ఆమె ఆశించిన మార్పు కనిపించింది.

"బ్లడీ బాస్టర్డ్!" అని కోపంగా తనలో తాను తిట్టుకుంటూ నవ్వన భార్యను తన స్థానంలోకి లాగి తను భార్య స్థానంలో నిల్చున్నాడు. అంటే ఇప్పుడామె భర్త సత్యంకు ముందు నిల్చుని వున్నాడు.

ఆమె నవ్విన తర్వాత అతని బుర్రలో ఫ్లాష్‌లా వెలిగింది అయిడియా. అదే పని అతను ముందుగానే చేసివుంటే...?

అది చూసి కిసుక్కున నవ్వి కామెంట్ చేశాడు అతని స్నేహితులలో ఒకడు.

"గురుడుకి బ్రెయిన్ బాగానే పనిచేసిం దోయ్!" పగలబడి నవ్వేరు అతని స్నేహితులు.

కోపంతో అతని ముఖం జేవురించింది. వారు ఘోరంగా పరాభవించబడుతుంటే చూడాలని మనసు తహతహ లాడుతోంది.

'ఇంకా నయం! తను ఇప్పటికయినా మేల్కొన్నాడు కాబట్టి సరిపోయింది. తర్వాత ఏం జరిగినా తను నిస్సహాయుడైపోవాలి. తన ఎదురుగానే తన భార్యతో సరసాలకు దిగుతాడా! ఎంత ధైర్యం. ఈ తరహా మనుషులకి సరైన బుద్ధి రావాలంటే సరైన ప్రాయశ్చిత్తం ఏమిటి...?

వీడ్ని మామూలుగా వదలకూడదు. బస్సులో అందరూ ఛీ...ఛీ అంటుంటే తను చూడాలి. అప్పుడు కానీ మనసు తృప్తి పడదు.'

## శివారెడ్డికి అకాడమీ అవార్డు



విప్లవాభిమానం ప్రకటిస్తూ, దాదాపు దశాబ్ద కాలంగా నిర్విరామంగా కవితలు రాస్తున్న ప్రసిద్ధ కవి శ్రీ కె.శివారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ 1990కి గాను అవార్డు ప్రకటించింది. 'మోహనా, ఓ మోహనా!' అన్న కవితా సంకలనానికి యీ అవార్డు లభించింది. అవార్డు క్రింద 25 వేల రూపాయిల నగదునూ, అభినందన పత్రాన్నీ అకాడమీ శ్రీ శివారెడ్డికి అందజేస్తుంది.

దాదాపు అరడజన్ కవితా సంకలనాలను వెలువ రించిన శివారెడ్డిని అనుసరించిన వాళ్ళూ, అభిమానించిన వాళ్ళూ తెలుగు కవుల్లో ఎందరో వున్నారు. శివారెడ్డి అభిమానులే కాక, తెలుగు కవిత్వానికే గుర్తింపు లభించినందుకు సాహిత్యాభిమానులంతా సంతోషిస్తారు.

వారిపై ఏవిధంగా ప్రతీకారం తీర్చుకోవాలో ఆలోచించ సాగేడతను. కోపంతో అతని కళ్ళు ఎర్ర బడ్డాయి.

ఫ్లాష్ లాంటి అయిడియా తళుక్కున మెరిసింది.

తనను ఎవరూ గమనించటం లేదని నిర్ధా రణ చేసుకుని ప్యాంట్ జేబులో వున్న పర్సును మెల్లిగా బయటకు తీసి తన పక్కనే వున్న సత్యం చేతిలో చటుక్కున పర్సును పెట్టేసి పర్సుకోసం అతనితో పెనుగులాడుతున్నట్టుగా నటిస్తూ "దొంగ...జేబుదొంగ నా పర్సును కొట్టేయాలని ప్రయత్నం చేస్తున్నాడు" అని గట్టిగా అరిచాడు.

డ్రైవరుతో సహా అందరూ అటువైపు చూసారు. ఇంకా అతనితో పెనుగులాడుతూనే వున్నాడతను. తర్వాత అతని చేతిలో పర్సును లాక్కొని జేబులో పెట్టుకుంటూ "వీడు పచ్చి దొంగలా వున్నాడు. ఈ జనం, అదను చూసు కొని నా పర్సును కొట్టేశాడు. సమయానికి నేను చూశాను కాబట్టి సరిపోయింది. లేకపోతే ఇందులో వున్న అయిదువేల రూపాయిలు వీడి పరమైపోను" అన్నాడు.

"వీళ్ళు నలుగురూ జేబుదొంగలే. ముగ్గురు మనల్ని కబుర్లలో పెడుతుంటే ఒకడు పని చక్కబెట్టసాగేడు. ఈ విధంగా పని సులువవు తుందని ఆలోచన" నిర్ధారించి చెప్పేరెవరో.

"ఒరే దొంగ వెధవ! అందుకేనట్రా నా మెడలో గొలుసువంక అంత ఆబగా చూస్తు న్నావు" నలుగురిలో ఒకడ్ని ఛీత్కారంగా అందో ముసలమ్మ. ఒక్క క్షణం మతి పోయింది వారికి. ఏం జరుగుతోందో ఒక్క ముక్క అర్థం కావటం లేదు. నలుగురూ తెల్లబోయి చూస్తుం డగానే "కొట్టండ్రా...తన్నండ్రా... మళ్ళీ ఎప్పుడూ దొంగతనాల జోలికి వెళ్ళకుండా బుద్ధి చెప్పాలి. అందుకే కొట్టండి...కొట్టండి... తన్నండి" పిచ్చిగా అరుస్తూ ప్రయాణీకులంతా నలుగురిపై తలో చెయ్యి వేశారు.

ప్రయాణీకుల కాళ్ళూ చేతులు అలసిపోయి మనసు శాంతించేసరికి ఆ యువకుల బట్టలు దారప్పోగుల్లా చిరిగిపోయి, తల చిందర వందరగా చెరిగిపోయి, కాళ్ళూ చేతులూ వంకర పోయి, ఏది ముక్కో, ఏది మూతో తెలియ కుండా బూరెల్లా వాచిపోయి పిచ్చి బాగా ముదిరి పోయాక పిచ్చాసుపత్రి నుండి తప్పించుకొచ్చిన పేషెంట్లలా వున్నారు చూడటానికి.

అప్పటికి జరిగిందేమిటో చాలా వరకు అర్థ మయింది. అంతటి అవమానాన్ని భరించలేక పోయారు. సిగ్గుగా తలలు వాల్చుకున్నారు.

గొడవంతా చూసి డ్రైవరు బస్సు ఆపే శాడు.

వెంటనే నలుగురూ బస్సు దిగిపోయారు.

బస్సులో జనం వారి గురించి ఇంకా చెప్పు కుంటూనే వున్నారు.

సంతృప్తితో నిండిపోయింది తులసి భర్త మనసు.

మళ్ళీ బస్సు కదిలింది.

తర్వాత కోటిపల్లిలో బస్సు దిగాక భర్తతో అంది తులసి "వాడు చేసే రౌడీ చేష్టలు భరించలేక పోయాను. తన భార్య పరాయి మగాడి వంక చూసి నవ్వటం, పలకరించటం ఏ భర్తా భరించలేడు. పౌరుషంతో సరైన బుద్ధి చెప్తారనే మిమ్మల్ని రెచ్చగొట్టాను."

'నాకు తెలుసు' అన్నట్టుగా నవ్వి ఆమె చేతిలోని బేగ్ను అందుకుని ముందుకు దారి తీశాడు. అతని వెనకే ఆమె...